క్లుప్తంగా

వసతులు కల్పించండి



డీఎంతో మాట్లాడుతున్న గడుగు మహేందర్

జైనథ్: జైనథ్ మండల కేంద్రంలోని బస్టాండ్ లో ప్రయాణికులకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గడుగు మహేందర్ కోరారు. శనివారం ఆయన ఆర్టీసీ డీఎం కల్పనతో మాట్లాడారు. బస్టాండ్ నిరుపయోగంగా మారిందని, ప్రయాణికులు కూర్చోవడానికి కూడా వసతులు లేవన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని, సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న జడ్జి హుస్సేన్

బోథ్: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని బోథ్ సివిల్ కోర్టు జడ్జి బి.హుస్సేన్ అ న్నారు. శనివారం మండలంలోని పట్నాపూర్ ఆశ్ర మ పాఠశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొని మాట్లాడారు. విద్యాహక్కు, బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, ర్యాగింగ్, మోటార్ వెహికిల్ చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో సీఐ కిరణ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు గోడం చందన్, సర్పంచ్ సుగుణ, న్యాయవాదులు పంద్రం శంకర్, కుమ్మరి విజయ కుమార్, అడెపు హరీష్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

ఆదిలాబాద్‌అర్బన్: బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు సోదరుడు రాథోడ్ బీకు నాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత శనివారం పట్టణంలోని కైలాస్‌నగర్‌లో గల నివాసానికి వెళ్లి ఎమ్మెల్యేను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో వై.రాజేశ్వర్, సంతోష్, సారంగ్ రావు, తుడం వినోద్ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

సిరికొండ: మండల కేంద్రానికి చెందిన దత్తుస్వామి నివాసంలో శనివారం అయ్యప్ప పడిపూజను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పడిపూజలో అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

అన్నదానం

తలమడుగు: మండలంలోని లింగి సాయి వృద్ధాశ్రమంలో ఆదిలాబాద్ పట్టణంలోని లిటిల్ స్టార్ పాఠశాల విద్యార్థులు అన్నదానం చేసి, పండ్లు పంపిణీ చేశారు. విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు వృద్ధులతో గడిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఆదిలాబాద్‌టౌన్: టీఎస్ యూటీఎఫ్ ఆదిలాబాద్ మండల శాఖ క్యాలెండర్‌ను జిల్లా సెక్టోరియల్ అధికారి కంటె నర్సయ్య పట్టణంలోని బ్రహ్మణవాడ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సంజీవ్, జిల్లా సంయుక్త కార్యదర్శి ఆర్ష రమేష్, పట్టణ శాఖ అధ్యక్షుడు ఎన్నవార్ సంజయ్, కిరణ్ పాల్గొన్నారు.

సీఐకి సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌అర్బన్: రాష్ట్రంలో ఉత్తమ పోలీసు స్టేషన్‌గా గుర్తింపు పొందినా సందర్భంగా, వన్‌టౌన్ సీఐ కె.సత్యనారాయణను శనివారం వాణిజ్య వర్తక వ్యాపారుల సంఘం ప్రతినిధులు అభినందించారు. ఆయన సేవలను కొనియాడుతూ.. ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు గండ్రత్ సంతోష్ మాట్లాడుతూ.. సమాజంలో పో లీసుల పాత్ర కీలకమని, ప్రజల్లో స్నేహపూర్వక వాతావరణం, గౌరవం మరింత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కమల్ కిషోర్ అగర్వాల్, సలహా కమిటీ చైర్మన్ రాజేశ్వర్, కార్యవర్గ సభ్యులు నాలం రాకేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న కాలువ పరిశీలన

ఖానాపూర్: మండలంలోని పాతఎల్లాపూర్ సమీపంలో ఇటీవల దెబ్బతిన్న కాలువకు మరమ్మతులు చేసినా కుంగిపోవడంతో శనివారం రాత్రి కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు దయానంద్, షబ్బీర్‌పాషా, నిమ్మల రమేశ్, తోట సత్యం, రాజ్‌కుమార్ ఉన్నారు.

న్యూ ఇయర్ సంబురం

జిల్లా వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. యువకులు కేరింతలు కొడుతూ డీజే పాటలకు నృత్యం చేశారు. 2022కు వీడ్కోలు పలుకుతూ 2023 నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. కేక్‌లను కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ సంబురాలు జరుపుకున్నారు. విందులు, వినోదాలతో సందడి వాతావరణం నెలకొంది. అర్ధరాత్రి 12 గంటలకు 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ కొత్త సంవత్సరానికి వెల్‌కమ్ చెప్పారు.

- సాక్షి, నెట్‌వర్క్



కేక్‌కట్ చేస్తున్న యువతులు



కేరింత కొడుతున్న యువతి



బిర్యానీ కొనుగోలు చేస్తున్న ప్రజలు



కేక్‌కట్ చేస్తున్న అర్బన్ సీపీడీవో వనజ



రెస్టారెంట్‌లో సందడి



డాన్సు చేస్తున్న యువత

త్రీఫేజ్ కోసం ఎదురుచూపులు

- వర్షాధారంపైనే ఆధారపడిన గిరిజనులు
- త్రీఫేజ్ విద్యుత్ లేక ఎండుతున్న పంటలు
- సర్వే చేసినా.. ప్రారంభం కాని పనులు



సర్వే చేస్తున్న విద్యుత్, అటవీశాఖ అధికారులు

సిరికొండ: గిరిజనులకు వ్యవసాయం తప్పా మరో ఉపాధి లేదు. అది కూడా వర్షధారంపై ఆధారపడి పంటలు పండిస్తారు. గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఐటీడీఏ తరుపున వ్యవసాయ పొలాల్లో బావులు తవ్వించింది. కానీ ఆబావులు నిరుపయోగంగా మారాయి. బావికి మోటార్ పెట్టుకుందాం అనుకుటే త్రీఫేజ్ కరెంట్ లేక గిరిజన రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఏన్నో ఏళ్లుగా త్రీఫేజ్ కరెంటు కోసం ఎదురు చూస్తున్నారు.

పనుల్లో తీవ్ర జాప్యం..

మండలంలో గత కొన్ని నెలల క్రితం గిరిజన గ్రామాల్లో త్రీఫేజ్ కరెంటు కోసం అటవీ, విద్యుత్ శాఖ అధికారులు కలిసి విన్నవించారు. దీంతో మండలంలోని ధర్మన్నపేట్, బర్సిగుట్ట, రిమ్మ, బాదిగూడ, చిమ్మన్‌గూడి, నేరడిగొండ(కె), సూర్యపేట్, వాయిపేట్, కొలంగూడ, కన్నాపూర్ గ్రామాల్లో సర్వే నిర్వహించారు. ఇక త్రీఫేజ్ కరెంట్ వస్తుందని గిరిజన రైతులు సంబుర పడ్డారు. సర్వే చేసి నెలలు గడుస్తున్నా.. ఇంకా పనులు ప్రారంభం కాలేదు.

నష్టపోతున్న రైతులు..

మండలంలో మొత్తం 19 గ్రామ పంచాయతీలు 52 గ్రామాలున్నాయి. 10 గిరిజన గ్రామ పంచాయతీలో వ్యవసాయమే జీవానాధారం. ఇక్కడ ఎర్రనేలలు, ఇసుక నేలలు అధికంగా ఉన్నాయి. వర్షం పడితే తప్పా.. విత్తనాలు విత్తుకోలేరు. పంటల దిగుబడి అంతంత మాత్రమే. వర్షకాలంలో అతివృష్టి, అనావృష్టితో గిరిజన రైతులు నష్టపోతున్నారు. అదే త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పిస్తే గిరిజన రైతులు వివిధ రకాల పంటలు పండించే అవకాశం ఉంటుంది.

విద్యుత్ సౌకర్యం కల్పించాలి



గిరిజన గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలి. అలాగే పనులు త్వరగా పూర్తి చేయాలి. త్రీ ఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పిస్తే ఏడాదిలో రెండు నుంచి మూడు పంటలు పండించుకోవచ్చు.

– తారాసింగ్, రైతు, ఫకీర్‌నాయక్ తండా

అనుమతులు మంజూరు

మండలంలోని గిరిజన గ్రామాల్లో త్రీఫేజ్ విద్యుత్ కోసం గత జున్ నెలలో సర్వే పూర్తి చేశాం. దీంతో అటవీశాఖ నుంచి కూడా అనుమతులు వచ్చాయి. పనుల ప్రారంభానికి ఎలాంటి ఆటంకం లేదు.

– వాహెబ్,
మండల అటవీశాఖ అధికారి

అధికారిక లాంఛనాలతో హెడ్‌కానిస్టేబుల్ అంత్యక్రియలు



అంత్యక్రియాల్లో పాల్గొన్న అధికారులు

తాంసి: తాంసి పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న రమణారెడ్డి శుక్రవారం గుండె పోటుతో మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా ఆయన అంత్యక్రియాలు శనివారం స్వగ్రామమైన బజార్‌హత్నూర్ మండలంలోని పిప్రి గ్రామంలో అధికార లంఛనాలతో నిర్వహించారు. పోలీస్‌శాఖ తరపున అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్ మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. గ్రామస్తులు, బంధువులు, పోలీస్ సిబ్బంది పెద్దఎత్తున చేరుకొని హెడ్ కానిస్టేబుల్‌కు కన్నీటి వీడ్కోలు పలికారు.

కాంగ్రెస్ కార్యకర్తల ముందస్తు అరెస్ట్



కార్యకర్తలను అరెస్ట్ చేసిన పోలీసులు

ఇంద్రవెల్లి: పోలీసు నియమకాల్లో అవకతవకలపై కాంగ్రెస్ నిర్వహించే ప్రగతిభవన్ ముట్టడిలో భాగంగా శనివారం మండల కాంగ్రెస్ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో సోమసే వెంకట్‌రావ్, మహ్మద్ జహీర్, ముఖడే ఉత్తం, గాయక్‌వాడ్ భగవాన్, సోన్‌కాంబ్లే జితేందర్, అజయ్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌అర్బన్: మద్యం షాపులు బంద్ చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో తలపెట్టిన ప్రగతిభవన్ ముట్టడికి వెళుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాతను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. శనివారం ఉదయం ఆమె నివాసానికి వెళ్లి అడ్డుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తుందని ఆరోపించారు. ఇందులో నాయకులు వెంకట్‌రెడ్డి, వెంకట్, మల్లయ్య, సామ రూపేష్‌రెడ్డి, రాజేశ్వర్, దండు మధుకర్, తుడం వినోద్, ఫైయిమ్, గజానన్ పాల్గొన్నారు.

పశువైద్యాధికారి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్చోడ: ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ సంస్థనందు పశువైద్యాధికారి పోస్టు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రోగాం మేనేజర్ సామ్రట్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బ్యాచ్‌లర్ వెటర్నరీ సైన్స్ నుంచి డాక్టరేట్ పొందిన వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ మంచిర్యాలలో జనవరి 2, 3 తేదీలలో హాజరు కావాలన్నారు. వివరాలకు 98665 41664 సంప్రదించాలని కోరారు.

నోట్ పుస్తకాలు పంపిణీ



నోట్ పుస్తకాలు అందజేస్తున్న భారతి

తాంసి: భీంపూర్ మండలంలోని అంతర్గాం పాఠశాల విద్యార్థులకు శనివారం ఐసీడీఎస్‌లో సూపర్‌వైజర్ భారతీ నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీకి ఫ్యాన్లు, బ్లాంకెట్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కపిల్, వారి స్నేహితులు రజిత, పుష్పరాణి, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

ఇద్దరికి గాయాలు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపల్‌గూడ శివారు ప్రాంతంలో బైక్ అదుపు తప్పి ఇద్దరికి గాయాలయ్యాయి. బేల మండల జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఏపీవో గా పని చేస్తున్న శామ్యూల్, టీఏ శ్యాంకుమార్‌లు వీధి నిర్వహణలో భాగంగా సాంగ్వి, సైద్‌పూర్ గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధిహామీ పనుల పరిశీలన కోసం శనివారం వెళ్లారు. పనులు పరిశీలించి తిరుగు ప్రయాణంలో యాపల్‌గూడ సమీపంలో బైక్ అదుపు తప్పి, గుంతలోకి దుసుకెళ్లింది. స్థానికులు 108కు సమాచారం ఇచ్చిన ఆసుపత్రికి తరలించారు.

మహిళ ఉద్యోగి ఆత్మహత్యయత్నం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా (టి) శివారులోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల 2లో కుక్ హెల్పర్‌గా విధులు నిర్వర్తిస్తున్న అవుట్ సోర్సింగ్ మహిళ ఉద్యోగి లతీఫా (50) శనివారం మాత్రాలు వేసుకొని ఆత్మహత్యయత్నానికి పాలడింది. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. బియ్యం చేరగడానికి జల్లాడ కొని ఇవ్వాలని వార్డెన్ ఆడగడంతో అసభ్య పదజాలంతో దూషించారని ఆరోపించారు. దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డనని తెలిపింది. ప్రస్తుతం ఆమె రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఇదే విషయంపై ఎస్సై నాగనాథ్‌ను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన



పౌష్టికాహారం అందజేస్తున్న సూపర్‌వైజర్

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత శనివారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల హాజర శాతం, పౌష్టికాహారాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. బరువు తక్కువ ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అంగన్‌వాడీ టీచర్ పద్మ, లతలకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంజీవ్‌రెడ్డి,ఎంపీటీసీ రేఖ, ఉప సర్పంచ్ అశోక్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'ఫుడ్ ఫెస్టివల్'



వంటకాలను పరిశీలిస్తున్న ఎస్‌వో నర్సయ్య



ఆహార దినోత్సవం నిర్వహిస్తున్న విద్యార్థినులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నంబర్‌– 2లో శనివారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థులు పోషకాలతో కూడిన వివిధ రకాల వంటకాలను తయారు చేసి తీసుకువచ్చారు. ఫుడ్ ఫెస్టివల్‌కు విద్యాశాఖ సెక్టోరల్ అధికారి నర్సయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వంటకాల రుచి చూసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బచన్‌సింగ్, ఉపాధ్యాయులు సుకుమార్, బాలప్రసాద్, చందు, అశోక్, భూపతి, సరిత, సుచరిత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన అవసరం

ఇంద్రవెల్లి: బాల్యం నుంచి పోషకాహారంపై అవగాహన పెంచుకోవాలని జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్‌సింగ్ తిలవత్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు తయారు చేసిన పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. పోషకాహారంతో పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదల ఉంటుందన్నా రు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక

ఆదిలాబాద్‌టౌన్: టీడీపీ పటిష్టత కోసం కార్యకర్తలు చిత్తశుద్ధితో పని చేయాలని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు గుల్లపెల్లి ఆనంద్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కాలనీకి చెందిన పలువురు యువకులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో తెలుగు యువత పార్లమెంట్ అధ్యక్షుడు గాలిపెల్లి నాగన్న, అల్లూరి రాజారెడ్డి, పట్టణ అధ్యక్షుడు రఫీక్, ఆత్రం జ్ఞానసుధ, ఆత్మారాం, తాళ్లపెల్లి, తదితరులు రాజేశ్వర్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

బేల: ఎలాంటి సమాచారం లేకుండా మండల విశ్వబ్రహ్మణ సంఘం ఎన్నికలు నిర్వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని విశ్వబ్రహ్మణులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లా కమిటీ సభ్యులు పడకంటి కిష్టయ్య, గొల్లపెల్లి నర్సింలు, కృష్ణస్వామి, సంతోష్‌కుమార్, భగవాండ్లు అధికార దుర్వినియోగం చేశారని ఆరోపించారు. కేవలం తోయగూడ, సిర్సన్న గ్రామాలకు చెందిన ముగ్గురితో కమిటీని ఎన్నికోవడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో శ్రీపాద విజయ్, గాడేవార్ దీపక్, బోగజివార్ సాగర్, దుర్శెట్టి రమేష్, రాజు, రోక్కంవార్ సురజ్, మురళీధర్, ఉమాకాంత్ పాల్గొన్నారు.

'అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం'



ఆదిలాబాద్: నరేశ్ ఫ్లెక్సీని దహనం చేస్తున్న నాయకులు



ఇంద్రవెల్లి: రాస్తారోకో చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్: హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోమని హిందూ సంఘాల నాయకులు హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ప్రధాన రహదారిపై శనివారం రాస్తారోకో నిర్వహించారు. బైరి నరేశ్ ఫ్లెక్సీని దహనం చేశారు. మద్నే సురేందర్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరికీ హిందు దేవుళ్లను కించపర్చాడం అలవాటైందన్నారు. అతడిపై పీడీయాక్ట్ పెట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పద్మావార్ రాకేశ్, రోహిత్ షిండే, అజయ్, కపిల్, నరేందర్, మహేష్ పాల్గొన్నారు.

తలమడుగు: హిందు దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌పై చర్యలు తీసుకోవాలని మండలంలోని సుంకిడి గ్రామంలోని అంతర్‌రాష్ట్ర రహదారిపై అయ్యప్ప స్వాములు అందోళన చేపట్టారు. బైరి నరేశ్‌ను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు కృష్ణ, దేవారెడ్డి, పోచ్చరెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని గ్రామ సమీపంలో అంతరాష్ట్ర రహదారిపై అయ్యప్పస్వాములు శనివారం సాయంత్రం రాస్తారోకో నిర్వహించారు. బైరి నరేశ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సై రాధిక అక్కడికి చేరుకొని నచ్చజెప్పడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో గురుస్వాములు జాదవ్ గణేష్, వినోద్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.



తాంసి: రాస్తారోకో చేస్తున్న స్వాములు

ఇంద్రవెల్లి: హిందువుల మనోభావాలు దెబ్బతిసేలా మాట్లాడిన బైరి నరేశ్‌పై చర్యలు తీసుకోవాలని హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు మారుతి డోంగ్రె అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి, పోలీసుస్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం ఎస్సై సునీల్‌కు ఫిర్యాదు చేశారు. మారోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలన్నారు. నాయకులు చింతవార్ సంతోష్, టహరే గణేష్, ఆరెల్లి రాజలింగు, శివకుమార్, దేవ్‌పూజే మారుతి, కేంద్రే శ్యాం, కైలాస్, విజయ్‌సింగ్, బాలాజీ పాల్గొన్నారు.

పీడీయాక్ట్ నమోదు చేయాలి

బేల: అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేశ్‌పై పీడీయాక్ట్ నమోదు చేయాలని విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు ప్రఫుల్, టౌన్ అధ్యక్షుడు ఉప్పల నారాయణ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్‌ల ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో నాయకులు గేడాం ప్రవీణ్, అగర్కార్ అకాష్, బర్కాడే రాము, కృష్ణ, ప్రీతం, పవన్ రెడ్డి, అజయ్, తదితరులు పాల్గొన్నారు.



బేల జాతీయ రహదారిపై..